క్లుప్తంగా

దుస్తుల పంపిణీ



గీసుకొండ: మండలంలోని మచ్చాపూర్ గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆదివారం అదే గ్రామానికి చెందిన మాచర్ల అనిల్‌కుమార్–సంధ్య దంపతులు సద్దుల బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా దుస్తులు, చీరలు పంపిణీ చేశారు. పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తు గ్రామాన్ని శుభ్రంగా ఉండేలా చూస్తున్న సిబ్బంది కృషి అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామస్తులు వల్లుల సారంగపాణి, మంద రమేశ్, లక్కర్సు రవికుమార్, వీరబద్రయ్య, మర్రి కుమారస్వామి, బత్తిని భాస్కర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నందినికి అభినందన



దుగ్గొండి : మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన భూమా నందిని ప్రతిష్టాత్మక యంగ్ చాంపియన్స్ అవార్డు, వరల్డ్ రికార్డు ఆఫ్ ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్ అందుకున్నారు. కాగా ఆదివారం కేంద్రమంత్రి బండి సంజయ్ భూమా నందినిని శాలువాతో సన్మానించి అభినందించారు. మరింత ఉన్నత శిఖరాలకు ఎదిగేలా తాను సంపూర్ణ సహకారాలు అందిస్తానని ఆమెకు భరోసా ఇచ్చారు.

పాలధార పుస్తకంలో సుమన్ పాట..



గద్దర్ పాలధార పాటల పుస్తకంలో మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన ప్రముఖ గాయకుడు నెల్లుట్ల సుమన్ రాసిన 'ఎర్రెర్రని సూర్యుడు' ప్రచురితమైంది. ఆదివారం హైదరాబాద్‌లోని ముగ్దుం భవన్‌లో నిర్వహించిన పాటల పుస్తకం ఆవిష్కరణ సభలో సుమన్‌కు సీపీఐ ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ చేతుల మీదుగా పుస్తకాన్ని అందుకున్నారు. ప్రొఫెసర్ కాసిం, గద్దర్ కుమారుడు సూర్యం, గద్దర్ సాంబయ్య, గాయకులు, రచయితలు సుమన్‌ను అభినందించారు.

టీఆర్‌పీలో చేరికలు



వర్ధన్నపేట : నియోజకవర్గానికి చెందిన పలువురు యువకులు ఆదివారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ)లో చేరారు. పార్టీలో చేరిన వారికి తీన్మార్ మల్లన్న కండువా కప్పి ఆహ్వానించారు. టీఆర్‌పీతోనే బీసీలకు రాజ్యాధికారం దక్కుతుందని విశ్వసిస్తూ పార్టీలో చేరినట్లు పలువురు తెలిపారు.

యూరియా కోసం బారులు



ఖానాపురం : యూరియా కోసం రైతులు బారులుదీరారు. మండలంలోని దబ్బీర్‌పేట, అశోక్ నగర్ గ్రామాల్లో రైతులు ఆదివారం తెల్లవారుజాము నుంచే ఎదురుచూశారు. అశోక్‌నగర్‌కు 555, దబ్బీర్‌పేటకు 222 బస్తాల యూరియా వచ్చింది. ఎస్సై రఘుపతి ఆధ్వర్యంలో పోలీసుల రైతుల వద్ద కార్డులు తీసుకొని క్యూలో పెట్టారు. ఏఈఓ నాగరాణి, సీఈఓ ఆంజనేయులు ఆధ్వర్యంలో టోకెన్లు పంపిణీ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఖానాపురం : మండలంలోని రంగాపురం గ్రామంలో ఆదివారం గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (గోపా) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా మడత శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా కందుల అజయ్, వీరభద్రం, ప్రధాన కార్యదర్శిగా తండా రమేశ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిలుగా బంధారపు శ్రీనివాస్‌గౌడ్, బత్తిని శ్రీనివాస్, కోశాధికారిగా రావుల రాజేందర్, మహిళా కార్యదర్శిగా అంజలి, అనిత, ముఖ్య సలహాదారులుగా రమేష్, గోవర్ధన్, విజేందర్, యాకయ్య, అనిల్, వెంకన్న, హరిప్రసాద్, ఉపేందర్, మనోహర్, ముఖ్య సలహాదారులుగా రమేశ్, గంగాపురం రమేశ్ ఎన్నికయ్యారు.

అభివృద్ధి.. జాడేది?



చిన్న గురిజాల గ్రామపంచాయతీలో బురదగా మారిన అంతర్గత రోడ్డు



రోడ్డు పై పారుతున్న మురుగు నీరు

చిన్న గురిజాలలో సమస్యల తిష్ట

- బురదమయంగా అంతర్గత రోడ్లు
- కానరాని సీసీ రోడ్లు, డ్రెయినేజీలు
- రోడ్లపై పారుతున్న మురుగు నీరు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

నర్సంపేట రూరల్ : నిధులు లేక గ్రామాల్లో సమస్యలు పేరుకు పోతున్నాయి.. గ్రామంలోని అంతర్గత రోడ్లు బురదమయంగా మారి స్థానికులు నడిచేందుకు సైతం కష్టంగా మారింది. దీనికి తోడు సైడ్ డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. ఆయా రోడ్లపై నడవాలంటే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని, సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలకు మహిళలు, గ్రామస్తులు ఎలా బయటకు వస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ఆమడ దూరంలో అభివృద్ధి..

చిన్న గురిజాల గ్రామం చెన్నారావుపేట మండలంలోని జీజీఆర్‌పల్లి పంచాయతీ పరిధిలో ఉండేది. 2018లో మండలాల పునర్విభజనలో భాగంగా చెన్నారావుపేట నుంచి ముగ్దుంపురం, పాత ముగ్దుంపురం, గురిజాల, గుర్రాలగండి రాజపల్లి (జీజీఆర్‌పల్లి) గ్రామాలను నర్సంపేట మండలంలో విలీనం చేశారు. అనంతరం వెయ్యి మంది జనాభా ఉన్న గ్రామాలను, తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో చిన్నగురిజాలను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. 2019 సంవత్సరంలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తికాగానే నర్సంపేట మండలానికి ఆ గ్రామాలను పూర్తిస్థాయిలో అప్పగించారు. అయితే ఆరేళ్లు గడిచినా కనీసం అభివృద్ధిలో ఆమడ దూరంలో ఉండిపోయింది. చిన్న గురిజాల గ్రామంలో మొత్తం 239 ఇళ్లు, 845 మంది జనాభా ఉన్నారు. పురుషులు 423, మహిళలు 422 మంది ఉన్నారు. అంతర్గత రోడ్లు లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు మటిరోడ్లు బురదమయంగా మారాయి. డ్రెయినేజీలు లేక మురుగు నీరంతా రోడ్లపైనే పారుతోందని, దీంతో ప్రజలు ఆ రోడ్లపై నడవాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటు చేస్తే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందనే లక్ష్యంతో గ్రామ పంచాయతీలుగా ఏర్పడినప్పటికీ అభివృద్ధిలో మాత్రం వెనుక బడిపోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలకు ఈ రోడ్లపై వెళ్లాలంటే ఇబ్బందులు పడుతు వెళాల్సిందే. కనీసం బురద రోడ్లపై మొరం కూడా పోయలేని దుస్థితిలో అధికారులు ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం..

మండల వ్యాప్తంగా పలు గ్రామ పంచాయతీలకు నిధులు లేక అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అడపదడపా నిధులు వచ్చినా అవి ఫ్రీజ్‌లో ఉండడంతో నిధులు తీసుకునే వీలు లేకుండా పోయింది. ప్రజా సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించి, వారి ఆదేశాల మేరకు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాం..

– రాంమోహన్, ఎంపీఓ, నర్సంపేట

దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



నర్సంపేట: మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న రాణా ప్రతాప్‌రెడ్డి, బీజేపీ నాయకులు

నర్సంపేట : దేశాభివృద్ధిలో ప్రతీ పౌరుడు భాగస్వామి కావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కోరారు. ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ మన్ కి బాత్ కార్యక్రమాన్ని కన్వీనర్ కాసుల నాగేంద్రబాబు, బీజేపీ నాయకులతో కలిసి రాణాప్రతాప్‌రెడ్డి వీక్షించారు. ఈ సందర్భంగా దేశ అభివృద్ధి, సాంకేతిక ప్రగతి, యువత పాత్ర, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛభారత్ కార్యక్రమం, మహిళా సాధికారత వంటి పలు కీలక అంశాలపై మోదీ ఆలోచనలు పంచుకున్నారు.

మన్ కీ బాత్ వీక్షించిన కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట : ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనస్సులోని మాటలను ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ ప్రధాని దేశ ప్రగతికి, అభివృద్ధి వివిధ వర్గాల ప్రజలు చేయాల్సి కార్యక్రమాలపై సూచనలతో పాటు ఆయా వర్గాలు చూపిస్తున్న మేధస్సు పట్ల అభినందనలు తెలిపి గొప్ప కార్యక్రమం అని అన్నారు.

నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు



ప్లకార్డులతో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నర్సంపేట : బతుకమ్మ సంబురాలకు నిధులు కేటాయించకపోవడం రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగల రాగసుధ అన్నారు. పట్టణంలోని జ్యోతిబసు నగర్‌లో ఆదివారం ప్లకార్డులను ప్రదర్శిస్తూ బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాగసుధ మాట్లాడుతూ.. మహిళా సంక్షేమాన్ని విస్మరిస్తోందని, ఆరోగ్య సేవలను వెంటనే పునరుద్ధరించాలని, విద్య, వైద్యం, మద్యపానాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. బతుకమ్మ సంబురాలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించకపోవడం, బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ఇస్తామన్న చీరలు సకాలంలో అందించకపోవడం సిగ్గుచేటని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల వల్ల నష్టపోయిన పంటకు రైతులు పరిహారం అందించాలని, యూరియా కొరతకు నివారించాలని కోరారు. ఏఐఎఫ్‌డీడబ్ల్యూ జిల్లా కమిటీ సభ్యురాలు పుట్టపాక సునీత, గడ్డం స్వరూప, బెజ్జంకి అచల, ఈర్ల అనూష, మోటం సుహాసిని, మేడిద ప్రమీల, పిట్టల అనిత, గడ్డం నిర్మల, పుట్టపాక రవళి, లక్ష్మి, పుష్ప, జ్యోతి, సుశీల, ఐలమ్మ, రామక్క, రజిత, తదితరులు పాల్గొన్నారు.

మహాచండీ అలంకరణలో అమ్మవారు



వర్ధన్నపేట: దుర్గామాతను దర్శించుకుంటున్న దయాకర్‌రావు,భక్తులు



రాయపర్తి: దుర్గామాత ఉత్సవాల్లో పాల్గొన్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దంపతులు



నర్సంపేట: పూజలు చేస్తున్న భక్తులు

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని పోచమ్మతల్లి దేవాలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారు ఆదివారం శ్రీమహాచండీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే చెన్నారావుపేట మండలంలోని ఎల్లాయగూడెంలో దుర్గాదేవి అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు సమర్పించారు.

దుర్గామాతను దర్శించుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట /రాయపర్తి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఉప్పరపల్లిలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ బాధ్యులు దయాకర్‌రావును శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదం అందజేశారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, కమిటీ బాధ్యులు, స్వాములు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం


నెక్కొండ : మండల కేంద్రంలోని హనుమాన్ బజారులో కొలువుదీరిన అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గామాత శ్రీ మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు ప్రతిష్టాత్మకమైన చండీహోమ క్రతువు నిర్వహించారు.

దుర్గామాత ఆశీస్సులు ఉండాలి


రాయపర్తి : నియోజకవర్గ ప్రజలపై దుర్గామాత ఆశీస్సులు ఉండాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని రామాలయం, కొండూరులో నిర్వహించిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, రాజారామ్మోహన్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దుగ్గొండిలో..

దుగ్గొండి : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గాదేవి చండీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని మల్లంపల్లి బొడ్రాయి సెంటర్ దుర్గాదేవి వద్ద మహిళలు సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు.



నెక్కొండ: హనుమాన్ బజారులో చండీ హోమంలో పాల్గొన్న భక్తులు



దుగ్గొండి: మల్లంపల్లిలో..

జాతీయ భావం.. ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం



నర్సంపేట: మాట్లాడుతున్న కంది గోపాల్‌రెడ్డి



వర్ధన్నపేట: వేడుకలకు హాజరైన స్వయం సేవకులు

నర్సంపేట : వ్యక్తి నిర్మాణం, జాతీయ భావాలను పెంపొందించడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలో విజయ దశమి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ విపత్తు వచ్చిన స్వయం సేవక్ సంఘ్‌లు ముందుండి పాల్గొంటారన్నారు. వరంగల్ విభాగ్ కార్యవహా గద్దె రమేష్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి మొదలు కొని సంఘ్ పరివార్ దేశ హితం కోసం ఎన్నో కార్యక్రమాలు చేసిందన్నారు. అలాగే 1925నుంచి నేటి వరకు దేశంలో ఎంతో మందని జాతీయ వాదులుగా తయారు చేసి సమాజానికి ఎంతో మేలు చేసిందని తెలిపారు. సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని మొదలైన విషయాల గురించి స్వయం సేవకులకు దిశా నిర్దేశం చేశారు. నర్సంపేట ఖండ కార్యాహ కుసుమ శ్రీనివాస్, సహ కార్యావాహ రాజు, జిల్లా బాధ్యులు భాషబోయిన వెంకటేష్, తాత ఐలోని, విభూది శివ కుమార్, తాళ్లూరి వసంతరావు, గడ్డం రాము, మల్యాల రవి, చొల్లేటి జగదీశ్వర్, వేల్పుల శ్రీధర్, కోరె రాజు, జమాండ్ల ప్రశాంత్, గజ్జల దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

వర్ధన్నపేట : పట్టణ కేంద్రంలోని భారతీయ నాటక కళాసమితి ప్రాంగణంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఐన శ్రీనివాస్ హాజరై యువత దేశభక్తిని పెంచుకొని దేశ సేవకు, సమాజ సేవకు అంకితం కావాలని సూచించారు. అనంతరం స్వయం సేవకులు చేసిన యోగా, లాఠీ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ సైతం ఆర్‌ఎస్‌ఎస్ యూనిఫామ్‌లో పాల్గొన్నారు. స్వయం సేవకులు, స్థానికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు



ఖానాపురం : మండల కేంద్రం నుంచి రంగాపురం గ్రామానికి వెళ్లే రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు పనులను ఆదివారం ప్రారంభించారు. పండుగ పూట ప్రజలకు రవాణా సమస్యలు తీర్చేందుకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు గ్రామాల ప్రజలు రోడ్డుపై వెళ్లే క్రమంలో తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణ సమస్య పరిష్కారానికి తాత్కాలికంగా మరమ్మతు చేయించామన్నారు. రోడ్డుకు శాశ్వత పరిష్కారం సైతం త్వరలోనే చేస్తామన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు యడ్ల భిక్షంరెడ్డి,మండల మైనార్టీ అధ్యక్షుడు ఎస్‌కె. ముస్తఫా, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వీరమనేని సాగర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు



నర్సంపేట : సద్దుల బతుకమ్మ వేడుకలకు ఆయా గ్రామాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పంచాయతీ కార్యదర్శులు సిబ్బందితో రోడ్లకు ఇరువైపుల లైట్లను అమర్చారు. అలాగే బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో, నిమజ్జనం చేసే చెరువు కట్టలు, నీటి కాల్వల వద్ద లైట్లు ఏర్పాటు చేశారు. విద్యుత్‌కు ఇబ్బందులు తలెత్తకుండా జనరేటర్ సౌకర్యాలను సైతం ఏర్పాటు చేశారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



ఖానాపురం: నివాళులర్పిస్తున్న మాధవరెడ్డి

నర్సంపేట/ఖానాపురం/నెక్కొండ/రాయపర్తి: ఇటీవల మృతిచెందిన పలువురి కుటుంబాలను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. ఖానాపురం మండలంలోని రాగంపేటకు చెందిన నూనె బాలకృష్ణ, చెన్నారావుపేట మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కామగోని సూరయ్య, నెక్కొండ మండలంలోని గుండ్రపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ కనపర్తి రమేశ్ ఇటీవల మృతిచెందారు. కాగా వారి కుటుంబ సభ్యులను దొంతి మాధవరెడ్డి ఆదివారం పరామర్శించారు. అలాగే రాయపర్తి మండలంలోని పెర్కవేడు గుంటూరుపల్లికి చెందిన మాకినేని వీరయ్య ఇటీవల మృతిచెందగా దయాకర్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుల చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

రూ.5వేల పింఛన్ ఇవ్వాలి

ఐనవోలు: భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని, రెన్యూవల్ లేకుండా జీవిత కాలం కొనసాగే లేబర్ కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ ఫంక్షన్ హాల్‌లో యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రథమ మహాసభ సుదర్శన్, బోళ్ల వెంకటస్వామిల అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పలయ్య మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డు పథకాలను ప్రైవేటు కంపెనీలకు ఇవ్వకుండా ప్రభుత్వమే నిర్వహించాలని అన్నారు. జీఓ నంబర్ 12ను వెంటనే రద్దు చేయాలని మహాసభలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు కాడబోయిన లింగయ్య మాట్లాడుతూ 10 గంటలు పనిచేయించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఐనవోలు: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో బీఆర్‌ఎస్ పార్టీ యూత్ నాయకులు దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. ఆదివారం ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు కొద్దిసేపు బ్యాట్‌పట్టి యువకులతో క్రికెట్ ఆడి వారిని ఉత్తేజపరిచారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ తంపుల మోహన్, ఎన్నికల ఇన్‌చార్జ్ గుజ్జ గోపాల్‌రావు, రాంమూర్తి, మాజీ సర్పంచ్‌లు పాలకొండ సురేష్, ఉస్మాన్ అలీ, కడుదూరి రాజు, ఎల్లగౌడ్, తీగల లక్ష్మణ్, తాటికాయల కుమార్, కాటబోయిన అశోక్, గడ్డం రఘువంశీ, నాగరాజు, రాజు, లింగారెడ్డి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నర్సంపేట : చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న రోజుల్లోని పాత మధుర క్షణాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలు కప్పి షీల్డులు అందించి ఘనంగా సన్మానించారు. సిద్దార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, పూర్వ ఉపాధ్యాయులు మోతె ఇంద్రసేనారెడ్డి, రాజోజు రవీందర్, ఇళ్ల సూరయ్య, నాంపల్లి కుమారస్వామి, నల్ల సుధాకర్‌రెడ్డి, భారతి, సుభాషిణి, కొమురయ్య, కుమారస్వామి, స్వామి, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రమౌళి మృతి ఉద్యమాలకు తీరనిలోటు



నర్సంపేట : చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామానికి చెందిన ఎంసీపీఐ (యూ) సీనియర్ నాయకుడు పానుగోటి చంద్రమౌళి(86) ఆదివారం మృతి చెందాడు. కాగా చంద్రమౌళి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఎంసీపీఐ(యూ)రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తెలిపారు.ఈ సందర్భంగా చంద్రమౌళి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. పెద్దారపు రమేష్, కన్నం వెంకన్న, మొగిలి ప్రతాప్‌రెడ్డి, కుసుంబ బాబురావు, నాగెల్లి కొమురయ్య, ఎండి.రాజాసాహెబ్, కొత్తకొండ రాజమౌళి, చెన్నారావుపేట మండల కన్వీనర్ జన్ను రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశకీర్తిని ఇనుమడింప జేసేలా కార్యాచరణ..



కెనడా తెలుగు ప్రజలతో శాంతికృష్ణ ఆచార్య



బతుకమ్మతో తెలంగాణ ఆడపడుచులు

- డాక్టర్ శాంతికృష్ణ ఆచార్య

పర్వతగిరి : భారతదేశ కీర్తిని ఇనుమడింపజేసే విధంగా మన కార్యాచరణ, నడవడిక ఉండాలని తద్వారా ప్రపంచ శాంతిని సాధించగలమని బతుకమ్మ తల్లి గ్రంథకర్త, విశ్వ కళావిరాట్ డాక్టర్ శాంతికృష్ణ ఆచార్య ప్రవాస భారతీయులైన కెనడా తెలుగు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కెనడా దేశంలోని టొరెంటోలో 'తాకా' తెలుగు అలయన్స్ ఆఫ్ కెనడా అధ్యక్షుడు రమేష్ మునికుంట్ల అధ్యక్షతన నిర్వహించిన బతుకమ్మ తల్లి మహోత్సవాల్లో శాంతికృష్ణ పాల్గొని మాట్లాడారు. అనంతరం బతుకమ్మ ప్రతిమలను అలంకరించిన మహిళలకు లక్ష్మీకాసులు, బతుకమ్మ తల్లి జ్ఞాపికలను బహూకరించారు.

అమెరికాలో బతుకమ్మ సంబురాలు

వర్ధన్నపేట : తెలంగాణ అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అమెరికాలోని అరిజోనా రాష్ట్రంలోని ఫినిక్స్ నగరంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన ఆత్మకూరు రేష్మా సౌజన్య, ఆమె కూతురు నిరీక్ష పాల్గొన్నారు. వీరు కలిసి అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మ మొదటి స్థానంలో నిలవగా, బహుమతి అందుకున్నారు.